
# మనీ ప్లాంట్

**- శారదా అశోక్ వర్ధన్**



కథ

''ఏమండీ... ఇంక మనం వేరే కాపురం పెట్టడం అసంభవమే కదూ?' '

''ఎలా పెడతాం సుజా! అమ్మా, నాన్నా మనని ఎంతో అభిమానంగా చూసుకుంటున్నారు. పైగా మన ఆద్యకీ, శైషకీ మామ్మ తాతయ్య అంటే ఎంతో ఇష్టం. వాళ్లకి కూడా మనవరాళ్లంటే ప్రాణం. ఏ కారణం లేకుండా ఈ బంధాలన్నీ తెంపుకుని, వేరే కాపురం పెట్టి ఏం బావుకుంటాం?'' ఆమె భుజాల మీద చెయ్యేస్తూ అనునయంగా అన్నాడు ధీరజ్.

''వేరే కాపురం పెట్టడం అంటే బంధాలు తెంచుకోవడమనా అర్థం? వేరే వున్నా పిల్లలు వాళ్లని చూడ్డానికి రారా, వీళ్లు అక్కడికి రారా? ఏంటి ధీరూ నువ్వనేది? మనకి తెలిసిన వాళ్లు ఎంతమంది లేరలా? అక్కడికి నాకే ప్రేమలు లేనట్టు మాట్లాడతావు?'' కోపంగా అంది సుజా.

''అది కాదు సుజా! అసలిప్పుడు ఆ అవసరం ఏమొచ్చిందని? ఈ ఇంట్లో నీ ఇష్టాఇష్టాలకి అడ్డు చెప్పేవారెవరు? ఇంత పెద్ద ఇంట్లో అన్నయ్యా, వొదినా, నేనూ నువ్వు, వాళ్లపిల్లలు నౌధన్, ఈశాన్ తప్ప ఇంకెవరున్నారు. పైగా అన్నయ్యవాళ్ల ఫ్యామిలీ పైనే వుంటారు మేడ మీద. కింద మన మేగా?'' కొంచెం అసహనంగానే అన్నాడు ధీరజ్.

''ధీరూ! నువ్వు ఈ జన్మకు నన్నర్థం చేసుకోవు.

మీ వొదిన గారికేం? ఆఫీసు అంటూ పొద్దున్నే పోతుంది. రాత్రెప్పుడో వస్తుంది. సెలవు రోజుల్లో కూడా ఆవిడగారు కిందకి దిగదు. వెళితే వాళ్లమ్మ గారూ, వాళ్ల ఇతర బంధువులూ, ఫ్రెండ్స్ ఇళ్లకీ, లేకపోతే వాళ్లందర్నీ తనింటికే పిలిచి కాఫీలూ, ఫలహారాలూ, సంబరాలూ.... ఆ వొచ్చిన వాళ్లు వెళుతూ వెళుతూ కిందకొచ్చి ఒక్కసారి అందరికీ కలిపి 'హాయ్' చెప్పేసి వెళ్లిపోతారు. ఆవిడ చేసిన టిఫిన్లేవో ఒక ప్లేట్లో పెట్టి మన మొహాన కొడుతుంది.'' ఆవేశంలో కళ్లు పెద్దవి చేసి చేతులు తిప్పుకుంటూ చెప్పింది సుజాత.

''సుజా...నీ ఫ్రెండ్సూ, నీ వాళ్లు కూడా ఇక్కడకొస్తున్నారుకదా? ఇంకేంటి కంప్లయింట్?'' అమాయకంగా అడిగాడు ధీరజ్.

''ధీరూ...మరీ అంత అమాయకంగా నటించక. నాకు ఒళ్లు మండుతుంది. నీకు తెలీదా? నా ఫ్రెండ్సు, నా వాళ్లు వొచ్చినప్పుడు నేనెలా ఫీలవుతానో! కాస్త కూడా ప్రైవసీ వుండదు. అమ్మా, నాన్నా, చుట్టాలూ సరే, ఖర్మ.... నా ఫ్రెండ్సొచ్చినా అదే తంతు. ముందు ఆ ముసలాళ్లిద్దర్నీ పలకరించడం కాస్సేపు మాట్లాడేదాక, వాళ్లని ఊపిరి సలుపుకోనివ్వరు. నాతో మాట్లాడనివ్వరు... ఛీ... ఛీ.. బొత్తిగాసంస్కారం లేదు. వొచ్చిన వాళ్లు వెళ్లే దాకా వాళ్లూ అక్కడే తిష్ట...'' ఇంచుమించు ఏడుస్తున్నట్లుగానే మాట్లాడింది సుజాత గొంతు సవరించుకొని, కళ్లొత్తుకుంటూ...

ధీరజ్ గట్టిగా నవ్వాడు.

ఆ నవ్వు సుజాతకి మరొకప్పుడయితే చాలా ఇష్టం. పెద్దగా తెరలు తెరలుగా నవ్వుతాడు. పైగా ఎస్వీరంగారావులా, అలా నవ్వేటప్పుడు కందిరీగల్లాంటి నల్లటి మీసాలని మెలేస్తాడు. ధీరజ్ అలా మీసాలు మెలేస్తూ నవ్వుతూంటే, సుజాత మనసు పులకించిపోతుంది. కానీ ప్రస్తుతం ఆమె మనసు కోపజ్వాలలతో కుతకుతలాడిపోతోంది.

సుజా ఈ విషయం ప్రస్తావించడం ఇదేమీ మొదటిసారి కాదు. కానీ ఎప్పుడూ ఇంతసేపు సాగదీయలేదు. ''ఇవాళెందుకు ఇంత పట్టుపడుతోంది చెప్మా'' అనుకుని ''సుజా... ఇవ్వాళం జరిగింది? పొద్దుటి నుంచీ ఏమేం చేశావు? ఎవరైనా వచ్చారా? నీ ఫ్రెండ్స్, నా ఫ్రెండ్స్, కామన్ ఫ్రెండ్స్, రిలేటివ్స్...'' అడిగాడు సుజాత మెడ మీద కితకితలు పెడుతూ.

ధీరజ్ అలా మెడ మీద కితకితలు పెడితే, చుట్టుకుపోయి నవ్వుతుంది సుజా. అందుకే నవ్వకూడదనే నిగ్రహంతో దూరంగా జరిగిపోయి, మెడ మీద చేతులు పెట్టుకుంది.

అప్పుడే లోపలికొచ్చి ఆద్యా, శైషా ''నాన్నారూ... ఇవ్వాళ..అమ్మ క్లాస్‌మేట్ స్వప్న వచ్చింది '' అన్నారు.

ఆద్యా, శైషా ఇద్దరూ కవలలు. మూడేళ్లు నిండాయి. తెగ మాట్లాడతారు. వాళ్లని చూసుకోవడం కోసమే, ఇండియన్ బ్యాంకులో పనిచేసే సుజాత, ధీరజ్‌సలహా మేరకు రాజీనామా చేసింది. ధీరజ్ బలవంతం మీదేం కాదు. ఆ ఇద్దరి సంరక్షణా తనే దగ్గరుండి చూసుకోవాలని.

ధీరజ్ ఇద్దరినీ రెండు చేతుల మీదా ఎత్తుకొని ముద్దు పెట్టుకున్నాడు.

''మరీ... అమ్మకి పప్పీ...'' అంది ఆద్య.

''అమ్మ కోపంగా వుంది కదా మరీ...'' అంది శైష.

వాళ్ల మాటలకి మురిపెంగా నవ్వేసింది సుజాత. వెంటనే అదను కోసం కాచుకున్నట్లు గట్టిగా బుగ్గల మీద ముద్దులు కురిపించేశాడు ధీరజ్.

''బలే..బలే..'' చప్పట్లు కొట్టారు ఆద్యా శైషలు.

''అమ్మయ్య... కోపం పోయింది అంటూ తనూ చప్పట్లు కొట్టాడు ధీరజ్...సుజాత దగ్గరగా జరిగి.

సుజాత చిరునవ్వుతో, బుంగమూతిని మూడు వంకరలు తిప్పుతూ ధీరజ్‌ని ఓరకంటితో చూస్తూ నవ్వింది. ఆమె స్లీవ్‌లెస్ బ్లౌజ్ నుంచి కిరణాలు జబ్బల మీద పడ్డట్టుగా అనిపించింది ధీరజ్‌కి. వెంటనే జబ్బలని కొరుకుతూ ముద్దులు కురిపించాడు.

''ఆ!... ఏమంటుంది స్వప్న?'' అడిగాడు నెమ్మదిగా.

''ఏమంటుందీ పాపం? ఏదో కష్టం సుఖం చెప్పుకుని సరదాగా మాట్లాడుకుందామని వస్తే, మీ అమ్మా, నాన్నా దాన్ని వదిలి పెడితే కదా...! ఏదో స్నేహితులు మాట్లాడుకుంటారు అని కాస్సేపు పలకరించి లోపలకి వెళ్లిపోవచ్చు కదా... అహఁ... అక్కడే తిష్ట వేశారు. కదలకుండా రాతి విగ్రహాల్లా... అది వెళ్లే వరకూ కూడా..! బొత్తిగా మేనర్స్ లేవు...'' అంది కళ్ల నీళ్లు పెట్టుకుంటూ...

''ఏడవకు... ఏడవకు నా చిట్టి సుజా... ఏడిస్తే నీ కళ్లు నీరు కారేనూ...'' అంటూ రాగయుక్తంగా నవ్వుతూ పాడుతున్న ధీరజ్‌ని చూస్తే కోపం, నవ్వు అన్నీ ముంచుకొచ్చాయి సుజాతకి.

అంతలోనే ''నాన్నా ధీరూ.... అమ్మా సుజా... రండి కంచాలు పెట్టాను భోజనానికి. ఆద్యా, శైషల భోజనం అయిపోయింది పిలిచింది వసుంధర.

''ఆఁ....పదండి ఆర్డరొచ్చిందిగా'' అంది ధీరజ్‌ని చూస్తూ సుజాత.

అలా ప్రేమగా పిలిచి నాకు నీకు కొసరి కొసరి వడ్డించే అమ్మ వుండడం ఎంత అదృష్టం. అందుకే 'భోజ్యేషు మాతా' అన్నారు... తరువాతది నీకు తెలుసు. శయనేషు రంభా అంటే ''నువ్వు''... అంటూ గట్టిగా కౌగిలించుకున్నాడు ధీరజ్...


''ఛీ'' అంటూ భోజనాల గది వైపు అడుగు వేసింది. వెనకాలే అతనూ వెళ్లాడు. ''ఒరేయ్ ధీరూ! నీకు ఆ కాకరకాయ వేపుడు చాలా ఇష్టం కదా, ఇంకా కొంచెం వేసుకో''... కొసరి కొసరి వడ్డించింది వసుంధర.

''అమ్మా సుజా! నీ కిష్టమైనది నాకు తెలుసు. ఇదిగో కంది పచ్చడి కలుపుకొని నెయ్యి వేసుకో... ఈ వయసులో నెయ్యి తింటే బలం వస్తుంది. ఫాట్స్ వుంటాయి కదా... మన భోజనంలో వున్న ఫాట్స్ నెయ్యి, పెరుగే...శరీరానికి బలం, ఛాయ అన్నీ వుంటాయి. డైటింగ్ పేరుతో లైఫ్ ఎంజాయ్ చేయరు ఈకాలపు పిల్లలు. అతిగా ఏదీ మంచిది కాదు. మితంగా అన్నీ తినొచ్చు'' అంది కోడలికి నెయ్యి వడ్డిస్తూ వసుంధర.

''అమ్మా సుజా.... మీ అత్తయ్య హోంసైన్స్ చదివింది కదా... అందుకే ఫుడ్ విషయం ఆవిడేం చెపితే అది మనం వినాలి'' నవ్వుతూ అంటూ ప్రకాశరావుగారు, వసూ నాకు మాత్రం ఆ కూరా, పచ్చడి,నెయ్యి మూడూ కావాలి'' అన్నారు.

''నో..నో... నెయ్యి ఫర్ యూ... కొలస్ట్రాల్... కూరా, పచ్చడీ ఓ..కే..'' అంది నవ్వుతూనే వసుంధర.






''థాంక్యూ...ఫర్ శాంక్షనింగ్ టు ఐటమ్స్'' అన్నారాయన కూర కలుపుకుంటూ.

అలా కబుర్లతో భోజనాలు పూర్తి చేసుకొని గదిలోకొచ్చారు సుజాతా, ధీరజ్‌లు.

''అమ్మా... నాన్నా... గుడ్‌నైట్ అంటూ పిల్లలిద్దరూ వెళ్ళి మామ్మ గదిలో వున్న వాళ్ళ బంక్ బెడ్ మీద పడుకున్నారు. వసుంధర వాళ్ళకి కాసేపు కథలు చెప్పి, ఇద్దరూ పడుకోగానే తన మంచం మీదకి వెళ్ళి పడుకుంది.

''చూశావా ఎంత ప్రేమగా వడ్డిస్తుందో అమ్మ... ఎక్కువ తినేశాను'' అని బొజ్జ తడుముకుంటూ, సుజాత అందించిన వక్క పలుకులు నోట్లో వేసుకున్నాడు. సుజాత చెయ్యి పట్టుకొని మంచం మీద కూర్చోబెడుతూ...

''మీరు మంచి రాజకీయ నాయకులవుతారు రాజకీయాల్లోకెళితే...'' అంది.

***

మర్నాడు పొద్దుట కాఫీ కప్పునందిస్తూ ''భలేగా సమర్థిస్తారు మీరు మీ అమ్మా నాన్ననీ'' అంది.

ధీరజ్ కాఫీ సిప్ చేస్తూ, ''సుజా! నీకు నిజంగా వాళ్ళ దగ్గరుండడం ఇష్టం లేకపోతే చెప్పు... ఈ స్వంత ఇంటిని వదిలిపెట్టి ఏవో సాకులు చెప్పి వేరే ఇంటికి పోనక్కర్లేదు. లేదా ట్రాన్స్‌ఫర్ చేయించుకుని ఊరు విడిచి వెళ్ళిపోనక్కర్లేదు. అన్నయ్యనీ, వదిననీ కొన్నాళ్ళు కిందకొచ్చి వుండమని, మనం పిల్లలూ పైకెళ్ళి వుందాం సరేనా?'' అన్నాడు సీరియస్‌గానే.

సుజాత మాట్లాడలేదు.

ఆమె మౌనాన్ని అంగీకారంగానే భావించి వెంటనే ఆ ఏర్పాట్లు చేశాడు.

సూరజ్, ఛాయ కిందకి మారారు. వాళ్ళబ్బాయి కార్తీక్‌కి ఆ ఏటితో ఇంటర్ అయిపోవడంతో భిలాయ్‌లో సీటొచ్చి ఐఐటిలో చేరాడు. ధీరజ్, సుజాతా, ఆద్యా, శైషలు పైకి మారారు. సుజాతకి ఈ ఏర్పాటు బాగానే అనిపించింది. తన వాళ్ళూ, తన స్నేహితులూ అందరూ తనకోసం పైకొచ్చి కూర్చుంటున్నారు. కాకపోతే ఇంటిపనీ, వంటపనీ, పిల్లల పనీ ఒక్కర్తే చేసుకోలేక సతమతమయిపోతోంది. దానికి తోడు అస్తమానం మామ్మా, తాతా అంటూ కిందకీ పైకీ తిరుగుతున్న ఆద్యనీ, శైషనీ కట్టడి చెయ్యలేకపోతోంది. ఒకరోజు గబగబా మెట్లు దిగుతున్న ఆద్య మెట్ల మీంచి పడిపోయింది. తలకి గట్టి దెబ్బే తగిలింది. మందులూ ఇంజెక్షన్లూ అన్నీ అయి ఇంటికొచ్చింది. ఆద్య దెబ్బకి బెదిరిపోయిన శైషకి జ్వరం పట్టుకుంది. పిల్లలిద్దరూ క్షణం వదలడం లేదు. సరిగ్గా అప్పుడే ధీరజ్‌కి బెంగుళూరు వెళ్ళాల్సొచ్చింది ఆఫీసు పనిమీద. సాఫ్ట్‌వేర్ కంపెనీల్లో సెలవు అంత తొందరగా దొరకదు కదా. ధీరజ్ వెళ్ళక తప్పలేదు. ఛాయ వాళ్ళ అన్నయ్య కొడుకు పెళ్ళని అనకాపల్లి వెళ్ళింది. అతి కష్టం మీద ఇంట్లో పనులు ముగించుకొని మనుమరాళ్ళ దగ్గరకి వెళుతోంది వసుంధర. వెళ్ళినా ఎక్కువసేపు వుండలేకపోతోంది. అస్తమానం మోగే ఫోన్లు, కాలింగ్ బెల్లూ, సతమతమయిపోతోంది ఆమె. పిల్లలు ఆమె వెనకాలే వెళతామని గోల! వాళ్ళనాపేసరికి తల ప్రాణం తోకకొస్తోంది సుజాతకి. చాకిరీ, పిల్లల అవస్థ... స్నేహితుల బంధువుల రాకపోకలూ, విసుగెత్తిపోతోంది సుజాతకి. నాలుగు రోజుల తరువాత వచ్చాడు ధీరజ్!

ధీరజ్‌ని చూడగానే కోపం ముంచుకొచ్చింది సుజాతకి. ''మీ అమ్మగారు ముక్తసరిగా ఒక్కసారి వొచ్చి పిల్లల్ని చూసి వెళ్ళడమేనా ప్రేమంటే? పనేం చెయ్యనక్కర్లేదు, రెండు మూడుసార్లయినా వొచ్చి పిల్లల దగ్గర కూర్చోవచ్చుగా'' అంది కళ్ళలో నీళ్ళు నింపుకుంటూ.

''నువ్వు కిందికెన్నిసార్లు వెళ్ళావు?'' అడిగాడు ధీరజ్.

''ఇక్కడ పనితో ఛస్తుంటే కిందకెళ్ళి వాళ్ళకి కంపెనీ ఇచ్చి రావాలా?'' కోపంగా అంది సుజాత.

ఈసారి ధీరజ్‌కి కోపం వచ్చింది. కానీ, పైకి కనపడనీయకుండా అణచుకుంటూ. ''ఒక్కసారి వెళ్ళిరా... ఊc...'' అన్నాడు. ఆ స్థాయికి ఎప్పుడు వినని ఆ స్వరం. జవాబు చెప్పకుండా కిందకి వెళ్ళింది సుజాత.

సూరజ్ తండ్రికి బ్రేక్ ఫాస్ట్ తినిపిస్తున్నాడు. కొలెస్ట్రాల్ ఎక్కువయి గిడ్డిగా ఫీలవుతూ లేవలేకపోతున్నారు ప్రకాశరావుగారు. వసుంధర మోకాళ్ళు కొబ్బరికాయల్లా వాచిపోయాయి. రోజులో ఒక్కసారి పైకెక్కి దిగినందుకే! మోకాళ్ళ నొప్పులెక్కువవుతాయనే ఆమె ఎప్పుడూ మెట్లెక్కి పైకెళ్ళదు. అత్తయ్యాకీ, మామయ్యకీ వొంట్లో బాగాలేదనీ, పెళ్ళికాగానే ఒక్క రెండు రోజులుండి తిరిగొచ్చేసింది ఛాయ. ''మీరు మెట్లెందుకు ఎక్కారు అత్తయ్యా'' అని అంది ఆమె మోకాళ్ళు నిమురుతూ...

సుజాతకి కాళ్ళ కింది భూమి బద్దలై తాను అగాధంలోకి మునిగిపోతున్నట్టనిపించింది.

ఒక్కసారైనా ఆమెని పైకి పిలవకుండా తనే కిందకి ఎందుకొచ్చేదో ఇన్నేళ్ళు కలిసున్నా తనకి అర్థం కానందుకు సిగ్గుపడింది. అంతేకాదు. తను, తన తోటికోడలు ఛాయని అహంకారిగా, స్వార్థపరురాలిగా తన మనసులో చిత్రీకరించుకున్నందుకు తన మీద తనకే అసహ్యం వేసింది. ఇదా నా చదువు... అనుకుంటూ ఒక్క అంగలో పైకెళ్ళి, మంచం మీద వెల్లికిలా వెనక్కి పడుకున్న అతని చాతిపై తలపెట్టి వెక్కి వెక్కి ఏడ్చింది. 'ధీరజ్..ఫర్ గివ్‌మీ' అంటూ...

ధీరజ్ నవ్వుతూ ఆమె తల నిమిరాడు.

ఆ మర్నాడే చదరంగం ఆటలా, మళ్ళీ ఎక్కడి పావులక్కడికి. ఛాయా, సూరజ్‌లు పైకి, ధీరజ్, సుజాతలు కిందకి.

రాత్రి నాలుగు పాల గ్లాసులు ఆగదికి. రెండు బంక్ బెడ్‌లని ఆద్యా, శైషలకీ, రెండు వసుంధరా, ప్రకాశరావుగారికీ. సర్వర్లు ధీరజ్, సుజాతలు.

అనురాగం ఆ ఇంటిని 'మనీప్లాంట్'లా అల్లుకుంది.

ఆప్యాయతలు ముగ్గుల్లా పరుచుకున్నాయి.

'ఏమోయ్! నువ్విప్పుడు వేర్పాటువాదివా? సమైక్య వాదివా?' బుగ్గ మీద చిటికేస్తూ, ఆమె పొడవాటి జడను, తన మెడ చుట్టూ తిప్పుకుంటూ అడిగాడు.

''హమేషా... హమేషా.. సమైక్యవాదినే సార్... భారతదేశం ఒక్కటే... భారతీయులందరూ ఒక్కటే...'' అంది చీరకొంగును ఎడం చేత్తో జెండాలా పట్టుకుని ఊపుతూ, వంగి ధీరజ్ కళ్ళలోకి చూస్తూ... ''అర్థమైందా... మైడియర్ హజ్‌బెండ్'' అంది.

ధీరజ్ కళ్ళు ధగధగా మెరిసిపోయాయి. ''ఈ ఇంగ్లిషు గొడవెందుకు భారతనారీ... తెలుగులో చక్కగా చెప్పుము... దేశమంతా తెలుగు తెలుగని ఘోషించుచున్నది'' అన్నాడు.

''అటులనే మహాశయా... నా ప్రియమైన మొగుడా...'' అంది.

ఇద్దరి నవ్వులతో ఆ గది ప్రతిధ్వనించి పోయింది.

★